సమస్యల్లో సర్కారు బడి

- ప్రహరీ లేక తిప్పలు
- అసంపూర్తిగా దర్శనమిస్తున్న మరుగుదొడ్లు
- సమస్యలపై దృష్టి సారించని అధికారులు

పెద్దవంగర: ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని పాలకులు, అధికారులు చెబుతున్న క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. మౌలిక వసతుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు లేవంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

మరుగుదొడ్లు లేనివైనం

మండలంలోని జెడ్పీ, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలు మొత్తం 34 ఉన్నాయి. కాగా బంగారుచెలిమి తండా ప్రాథమిక పాఠశాల్లో 1 నుంచి 5వ తరగతి వరకు 26 మంది విద్యార్థులు చదువుతున్నారు. అందులో 10 మంది బాలికలు, ఇద్దరు ఉపాధ్యాయురాలు విధులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయురాలు, స్కావెంజర్, మధ్యాహ్న వంట కార్మికులు 2, పాఠశాల ప్రాంగణంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రంలోని మహిళా టీచర్‌తో కలిపి 14 మంది మహిళలు పాఠశాలల్లో వారి వారి హోదాల్లో విధులు నిర్వర్తిస్తుండగా.. మరుగుదొడ్లు, మూత్రశాలలు అందుబాటులో లేకపోవడంతో అవస్థలు ఎదుర్కొంటున్నారు. పాఠశాలకు పక్కా భవనం ఉన్నప్పటికీ ప్రహరీ లేకపోవడంతో పశువులు సంతరిస్తున్నాయి. పాములు, తేళ్లు వంటి విషపురుగులు సంచరిస్తుండడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి వేళలో ఆకతాయిలు వేసే బీరు సీసాలు, సిగరేటు ముక్కలతో ఉదయం పాఠశాలకు వచ్చే విద్యార్థులు, ఉపాధ్యాయులు అసహనానికి గురవుతున్నారు.


స్లాబ్ దశలో నిలిచిపోయిన మరుగుదొడ్లు

సౌకర్యాల లేమి..

గత ప్రభుత్వ హయాంలో మన ఊరు మన బడి పథకంలోనూ ఈ పాఠశాలను ఎంపిక చేసినప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదు. ఒక తరగతి గదితో పాటు వరండాతో కూడిన పాఠశాల కాగా గదిలో కేవలం రెండు ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. విద్యుదీకరణ, తాగునీరు, రంగులు లేవు. ఎన్‌ఈజీఎస్ కింద రూ.12 లక్షలతో ప్రహరీ, మరుగుదొడ్లకు నిధులు మంజూరు కాగా పిల్లర్లపై స్లాబ్ పోసి కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలేశాడు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయించి వినియోగంలోకి తీసురావాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.


ప్రహరీ లేని పాఠశాల

అధికారుల దృష్టికి తీసుకెళ్లా..



బంగారు చెలిమి ప్రాథమిక పాఠశాల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవామే. మరుగుదొడ్ల నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయాయి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా.. త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తా.

– శ్రీనివాస్, ఎంఈఓ

బస్టాండ్‌లో నిలుస్తున్న బస్సులు



దంతాలపల్లి: మండలకేంద్రంలో రెండ్లు చోట్ల బస్సులు నిలపడం వలన ప్రయాణికుల పరేషాన్ అనే శీర్షికతో శుక్రవారం ప్రచురితమైన కథనానికి తొర్రూరు డిపో అధికారులు స్పందించారు. గురువారం నుంచి తొర్రూరు డిపో బస్సులను అంబేడ్కర్ కూడలిలో కాకుండా బస్టాండ్‌లోనే నిలుపుతున్నారు. దీంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కానీ, వరంగల్, సూర్యాపేట డిపో బస్సులను కూడా బస్టాండ్‌లో నిలిపేలా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సాక్షి ఎఫెక్ట్..

విద్యుత్ స్తంభం ఏర్పాటు


విద్యుత్‌స్తంభం ఏర్పాటు చేయిస్తున్న సిబ్బంది

గార్ల: 'పక్కకు వంగి ప్రమాదకరంగా మారి..' అనే శీర్షికన 2 రోజుల క్రితం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. గార్లలోని అంబేడ్కర్‌నగర్‌లో బీటీ రహదారి పక్కన వంగి ఉన్న ఇనుప విద్యుత్‌స్తంభం స్థానంలో గురువారం విద్యుత్ ఏఈ మహేంద్రబాబు విద్యుత్ సిబ్బందిచే కొత్త సిమెంట్ విద్యుత్‌స్తంభం ఏర్పాటు చేయించారు. దీంతో స్థానికులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

శివపార్వతుల కల్యాణం

మహాశివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి, గురువారం పలు ఆలయాల్లో శివపార్వతుల కల్యాణాన్ని కన్నులపండుగా నిర్వహించారు. శివరాత్రి జాగరణ దీక్షను చేపట్టిన భక్తులు రాత్రి మొత్తం ఆలయాల్లో నిర్వహించిన పూజలు, కల్యాణ వేడుకల్లో పాల్గొని తరించారు. తెల్లవారుజామున ఉపవాస దీక్ష విరమించి శివుడికి పూజలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


మహబూబాబాద్ రూరల్: పాల్గొన్న అదనపు కలెక్టర్


కురవి: అన్నదానం చేస్తున్న దాతలు

కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతాం

- పీఏసీఎస్ ఛైర్మన్ హరిప్రసాద్

తొర్రూరు: పార్టీ మార్పుపై ప్రచారం అవాస్తవమని, కాంగ్రెస్‌లోనే కొనసాగుతామని పీఏసీఎస్ ఛైర్మన్ కాకిరాల హరిప్రసాద్, సీనియర్ నాయకులు రామసహాయం కిషోర్‌రెడ్డి స్పష్టం చేశారు. డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడారు. సొంత పనుల వల్లే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనలేకపోయామని, ఎమ్మెల్యే యశస్విని‌రెడ్డి, కాంగ్రెస్ ఇంచార్జ్ ఝాన్సీరెడ్డిలను కలవకపోవడం వల్లే తమపై అవాస్తవాలను కొందరు ప్రచారం చేశారన్నారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యా నాయక్, మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, నాయకులు ఎర్రబెల్లి రాఘవరావు, గంజి విజయపాల్‌రెడ్డి, చాపల బాపురెడ్డి, మంగళపల్లి రామచంద్రయ్య పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

క్రైం కార్నర్

కారులో వచ్చి.. పట్టపగలు చోరీ

మరిపెడ రూరల్: కారులో వచ్చిన ఓ దొంగ.. పట్టపగలే చోరీకి యత్నించాడు. స్టేజితండా గ్రామ పంచా యతీ పరిధిలోని కుడియాతండాలో గురువారం ఈ జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానికుల కథ నం ప్రకారం.. కుడియాతండా చెందిన గుగులోతు మంగ్య తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో సహా మిర్చి తోట వద్దకు వెళ్లారు. ఈక్రమంలో ఓ కారులో వచ్చిన వ్యక్తి మంగ్య ఇంటి ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డాడు. ఇంట్లో ఉన్న రూ.10 వేల నగదు, చెవిదిద్దులు దొంగిలించాడు. స్థానికులు రావడాన్ని గమనించిన దొంగ పారిపోవడానికి ప్రయత్నించగా వెంబడించి పట్టుకున్నారు. దేహశుద్ధిచేసి పోలీసులకు అప్పగించారు. కాగా చోరీకి పాల్పడ్డ వ్యక్తి ఖమ్మం జిల్లా మధిర మండలం మడిపెల్లి గ్రామానికి చెందిన బండి గోపిగా గుర్తించారు. సదరు దొంగ తీసుకొచ్చిన కారులో మరికొన్ని వెండి ఆభరణాలు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. మంగ్య ఫిర్యాదుతో కేసు విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్.. ఇద్దరిపై కేసు

నెల్లికుదురు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపారు. గురువారం ఎస్సై మాట్లాడుతూ మండల కేంద్రంలో పెట్రోలింగ్ చేస్తుండగా ఎస్సీ కాలనీ వైపు నుంచి ఇసుక ట్రా క్టర్ వస్తుండగా ఆపి పరిశీలించామన్నారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించి, ట్రాక్టర్ డ్రైవర్ గుణిగంటి ఉమేశ్‌తోపాటు ట్రాక్టర్ ఓనర్ కర్నె సాయిలుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

మహబూబాబాద్ రూరల్: పట్టణంలోని నందన గార్డెన్, రామచంద్రాపురం కాలనీ ప్రాంతాల్లో రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని వాటి యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేశామని టౌన్ సీఐ దేవేందర్ గురువారం తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇసుక రవాణాపై ఆంక్షలు ఉన్నాయని, ఇసుక అక్రమ రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

కురవి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నామని సీరోలు ఎస్సై నగేష్ గురువారం తెలిపారు. మరిపెడ మండలం మాన్‌సింగ్ తండా నుంచి సీరోలు గ్రామానికి వస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. ఇద్దరు డ్రైవర్లు, ఓనర్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మరిపెడ రూరల్: ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు మరిపెడ ఎస్సై సతీష్ గురువారం తెలిపారు. వివరాల ప్రకారం.. మండలంలో ని చింతలగడ్డాతండాకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఆంగోతు రవీందర్.. అనుమతి లేకుండా సమీప వాగు ల నుంచి ట్రాక్టర్ ద్వారా ఇసుకను తరలించి వ్యాపా రం చేస్తున్నాడు. దీంతో ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్ చేయడంతోపాటు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

గుడుంబా తయారీదారులపై..

మరిపెడ రూరల్: నల్లబెల్లం, పటిక తెచ్చి గుడుంబా తయారు చేస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు మరిపెడ ఎస్సై బొలగాని సతీష్ గురువారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని నీలికుర్తి శివారు దాస్య తండాకు చెందిన బానోతు లాలు, గుగులోతు వీరన్న అదేవిధంగా చిల్లంచర్ల గ్రామ పంచాయతీకి చెందిన అజ్మీరా నరేష్ అనే ముగ్గురు వ్యక్తులు నల్ల బెల్లం, పటికను గొలుగోలు చేసుకొని గుడుంబా తయారు చేస్తున్నారు. వారి వద్ద రూ.15 వేలు విలువ గల 1.5 క్వింటాళ్ల నల్ల బెల్లం, రూ.3 వేలు విలువ గల 30 కిలోల పటికను స్వాధీనం చేసుకొని, రూ.20 వేల విలువ గల 200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. బానోతు లాలు, గుగులోతు వీరన్న, అజ్మీరా నరేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

నర్సింహులపేట: మండలంలోని అజ్మీర తండా జీపీ పరిధిలోని వాంక్‌డోత్ తండాకు చేందిన వాంకుడోత్ బుజ్జి(36) చికిత్స పొందుతూ మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. ఐదు రోజుల క్రితం జరిగిన కుటుంబ కలహాలతో కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించడంతో ఆస్పత్రికి తరలించారు. ఈక్రమంలో గురువారం సాయింత్రం మృతి చెందింది.

వదినపై దాడి చేసిన మరిది అరెస్ట్

కేసముద్రం: ఇనుగుర్తి మండలంలోని కోమటిపల్లి గ్రామశివారు మూలస్తంభం తండాలో ఈనెల 26న వదినపై కొడవలితో దాడిచేసిన మరిదిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై మురళీధర్‌రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నూనావత్ రాజీపై తన మరిది నూనావత్ రమేష్ ఇంటి స్థలం విషయంలో కొడవలితో దాడి చేసి గాయపర్చిన విషయం తెలిసిందే. కాగా రాజీ భర్త రవీందర్ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు, రమేష్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్


కురవి పోలింగ్ కేంద్రం వద్ద డీఎస్పీ మోహన్, తదితరులు

జిల్లాలో గురువారం నిర్వహించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉపాధ్యాయ ఓటర్లు తమకు కేటాయించిన కేంద్రాల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలీసుల బందోబస్తు నడుమ అధికారులు, సిబ్బంది పోలింగ్ ప్రక్రియను ముగించారు. అనంతరం కేటాయించిన కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని తరలించారు. – సాక్షి నెట్‌వర్క్


చిన్నగూడూరు: ఓటు వేసిన ఉపాధ్యాయురాలు


చిన్నగూడూరు: విధుల్లో పోలీసులు, సిబ్బంది


గూడూరులో ఓటు వేసిన ఉపాధ్యాయులు


నెల్లికుదురు:ఓటు వేయడానికి వచ్చిన టీచర్



ఓటు వేస్తున్న ఉపాధ్యాయుడు, మహిళా ఓటరును వీల్ చైర్‌లో తీసుకొస్తున్న సిబ్బంది


జిల్లా కేంద్రంలోని పోలింగ్ కేంద్రం ఎదుట..


పెద్దవంగరలో..


దంతాలపల్లి: పోలింగ్ సామగ్రిని తరలిస్తున్న అధికారులు

ముగ్గురికి గాయాలు

మరిపెడ: ఆటోబోల్తా పడిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మరిపెడ మండలం చిల్లంచర్ల శివారు లచ్చిరాంతండాకు చెందిన భూక్య కవిత, విజేందర్, అజ్మీరా కౌసాలి.. కురవి నుంచి ఆటోలో మరిపెడకు ప్రయాణిస్తున్నారు. ఈక్రమంలో స్థానిక బొమ్మరిల్లు హోటల్ సమీపంలో ఆటో అదుపుతప్పి పల్టీ కొట్టింది. దీంతో గాయపడ్డ వారిని మరిపెడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

సంక్షిప్త సమాచారం..

గెలుపుపై పీఆర్టీయూ టీఎస్ ధీమా

దంతాలపల్లి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో పీఆర్టీయూ టీఎస్ అభ్యర్థి శ్రీపాల్ రెడ్డి విజయం సాధిస్తాడని ఆ సంఘం సభ్యులు ధీమా వ్యక్తం చేశారు. గురువారం పోలింగ్ అనంతరం పీఆర్టీయూ మండల అధ్యక్షుడు రాగిరి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. మండలంలో పోలైన ఓట్లలో ఎక్కువ శాతం పీఆర్టీయూ టీఎస్ అభ్యర్థికే వచ్చాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శాఖ రాష్ట్ర ఉపాధ్యక్షులు బీరవెల్లి మహేందర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గొడిశాల రఘు, యాక మల్లయ్య, హర్షవర్ధన్‌రెడ్డి, మధుకర్ రెడ్డి, వెంకన్న, యాకన్న, కుమారస్వామి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజులకొత్తపల్లిలో పురావస్తు శాఖ అధికారి

నెల్లికుదురు: మండలంలోని రాజులకొత్తపల్లిలోని పురాతన ఆలయాలను గురువారం వరంగల్ పురావస్తు శాఖ ఫోర్ మెన్ బాబు సందర్శించి పరిశీలించారు. గ్రామానికి చెందిన యువత పురావస్తు శాఖ అధికారుల దృష్టికి తీసికెళ్లగా గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయం, బాలాజీ స్వామి ఆలయాలను సందర్శించినట్లు తెలిపారు. ఈ ఆలయాలు 11వ శతాబ్దానికి చెందినవని గుర్తించారు. ఈ ఆలయాలకు చారిత్రాత్మక ప్రాధాన్యత ఉందన్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జన్నాద్, చొక్కాచారి, యాకయ్య, అశోక్, హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

మార్పు కోసం తీర్పునిచ్చారు

తొర్రూరు: మార్పు కోసం ఉపాధ్యాయులు తీర్పునిచ్చారని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మిరియాల సతీష్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డికి మద్దతుగా పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో గురువారం డివిజన్ కేంద్రంలోని ఎస్‌బీఐ ఎదుట ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జినుగ విప్లవ్‌రెడ్డి, నాయకులు పులి ముత్తిలింగం, నరసింహారెడ్డి, రమేష్, శ్రీధర్‌రెడ్డి, లింగమూర్తి, యాకయ్య, సోమయ్య పాల్గొన్నారు.

మోతాదుకు మించి వాడొద్దు..

పెద్దవంగర: వరి పొలాల్లో మోతాదుకు మించి యూరియా వాడకాన్ని తగ్గించాలని వ్యవసాయాధికారి స్వామి నాయక్ రైతులకు సూచించారు. గురువారం మండల కేంద్రంతోపాటు మండలంలోని అవుతాపురం, పోచంపల్లి గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. షాపుల నిర్వాహకులు ఈ పాస్ యంత్రాల ద్వారానే ఎరువులను విక్రయించాలని సూచించారు. యాసంగికి సరిపడా యూరియా అందుబాటులో ఉందని రైతులకు తెలిపారు.

శ్రీకాంత్‌ను సన్మానించిన మంత్రి సీతక్క



గంగారం : మండలంలోని పందెం గ్రామానికి చెందిన బచ్చల శ్రీకాంత్ ఆల్ ఇండియా నేషనల్ చాంపియన్ షిప్ హ్యాండ్ బాల్ మెడల్స్ అండ్ కప్ సాధించాడు. ఈక్రమంలో రాష్ట్ర మంత్రి సీతక్క శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఢిల్లీ సదస్సుకు తరలిన మాస్ లైన్ శ్రేణులు

మహబూబాబాద్ రూరల్ : ఆర్ఎస్ఎస్, బీజేపీల మతోన్మాద, కార్పొరేట్ దోపిడీకి వ్యతిరేకంగా శుక్రవారం జరుగనున్న అఖిలభారత సదస్సుకు మహబూబాబాద్ జిల్లా నుంచి సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ శ్రేణులు బుధవారం రాత్రి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాయం చిన్నచంద్రన్న మాట్లాడుతూ మైనార్టీలపై హిందుత్వ శక్తులు ప్రణాళిక ప్రకారం దాడులు సాగిస్తున్నాయని ఆరోపించారు. మోదీ అనుసరిస్తున్న రాజకీయ విధానాలతో భారత రాజ్యాంగం ప్రమాదంలో ఉందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కొత్తపల్లి రవి, ముంజంపల్లి వీరన్న, బిల్లకంటి సూర్యం, సత్యం, యాకయ్య, నవీన్, యాకయ్య, తదితరులు ఉన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటా..

పెద్దవంగర: కార్యకర్తలకు కష్టకాలంలో అండగా ఉండి కంటికి రెప్పలా కాపాడుకుంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని కొరిపల్లి గ్రామానికి చెందిన మట్టిపల్లి మహేశ్ (30) అనారోగ్యంతో మృతి చెందగా దయాకర్‌రావు.. గురువారం మహేశ్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేసి భరోసా నిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, ఉపాధ్యక్షుడు కూకట్ల వెంకన్న, నాయకులు శ్రీరాం సంజయ్, జ్ఞానేశ్వరా చారి, వెంకట్‌రెడ్డి, కూకట్ల యాకన్న, మల్లేశం పాల్గొన్నారు.

జంపన్న మృతి బాధాకరం

బయ్యారం: పార్టీ కోసం క్రమశిక్షణతో పనిచేసే కత్తి జంపన్న అకాల మరణం బాధాకరమని టీడీపీ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు కొండపల్లి రామచంద్రయ్య అన్నారు. గురువారం బయ్యారంలో టీడీపీ మండల నాయకులు జంపన్న మృతదేహం వద్ద నివాళులర్పించారు. కోటేశ్వరరావు, శ్రీహరి, నాయకులు పాల్గొన్నారు.

రేపు సీపీఐ సమావేశం

నెహ్రూసెంటర్: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) మహబూబాబాద్ నియోజకవర్గ సమితి సమావేశం మార్చి 1వ తేదీన జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పార్టీ నియోజకవర్గ కార్యదర్శి బి.అజయ్‌సారథిరెడ్డి గురువారం తెలిపారు. సమావేశంలో జీపీ ఎన్నికలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో అనుసరించాల్సిన తీరు, ఎన్నికల కోసం సమాయత్తమయ్యేలా పార్టీ శ్రేణులను సిద్ధం చేసేందుకు సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని సమస్యల గుర్తించి పోరాటాలు చేసేందుకు కార్యాచరణ చూపొందించనున్నట్లు వెల్లడించారు. సభ్యులు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

స్వయం పరిపాలన దినోత్సవం


విద్యార్థులతో ఉపాధ్యాయులు

చిన్నగూడూరు: మండలంలోని గుండంరాజుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి కింది తరగతుల విద్యార్థులకు విద్యాబోధన చేశారు. డీఈఓగా దొంతు వివేక్, ఎంఈఓగా విష్ణు, పాఠశాల హెచ్‌ఎంగా సింధుప్రియ, మిగతా విద్యార్థులు ఉపాధ్యాయ పాత్ర పోషించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు వీరేందర్, రాంబాబు, సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బంగారు మైసమ్మ తల్లికి పూజలు



మహబూబాబాద్ రూరల్ : అమావాస్య సందర్భంగా మహబూబాబాద్ మండలంలోని రెడ్యాల గ్రామంలో కొలువై ఉన్న బంగారు మైసమ్మ అమ్మవారికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిపించిన పూజలల్లో మా అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డుపెల్లి ఉపేంద్రం, ముక్కా లక్ష్మణరావు, వాస్తు పండితులు బోనగిరి గంగాధర్, మంగీలాల్, అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ ఉద్యమానికి అండగా నిలవాలి

నెహ్రూసెంటర్: ఎస్సీ వర్గీకరణ ప్రక్రియలో భాగంగా మాదిగ, మాదిగ ఉపకులాలకు రిజర్వేషన్ ఫలాలు అందేలా 30 ఏండ్లుగా మంద కృష్ణమాదిగ చేపడుతన్న వర్గీకరణ ఉద్యమానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ గుగ్గిళ్ల పీరయ్యమాదిగ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓసీ క్లబ్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా కమిటీల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. మార్చి 1న జరగనున్న మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మిర్యాల శ్రీను, మిడతపల్లి యాకయ్య, పాలెపాక ప్రవీణ్, ఇరుగు రవి, కత్తుల రేణుక, ఎండి.పాష, చలగొల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

మృతదేహంతో ధర్నా

కురవి: మండలంలోని రాజోలు గ్రామంలో విద్యుదాఘాతంతో పాశం మల్లయ్య బుధవారం మృతి చెందిన సంగతి విధితమే. ఈక్రమంలో సూపర్‌మార్కెట్ యజమాని ఏర్పాటు చేసిన ఎర్త్ వైర్ వల్లే మల్లయ్య మృతి చెందాడని కుటుంబ సభ్యులు, కొందరు గ్రామస్తులు గురువారం మహబూబాబాద్- డోర్నకల్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. మృతదేహాన్ని ఫ్రీజర్‌లో పెట్టి షాపు ఎదుట ధర్నా చేశారు. దీంతో కురవి పోలీసులు అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడినప్పటికీ శాంతించలేదు. గ్రామస్తులు షాపు యజమానితో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. బాధితుల ఫిర్యాదుతో విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీష్ తెలిపారు. అయితే యజమాని బాధిత కుటుంబానికి కొంత పరిహారం చెల్లించినట్లు తెలిసింది.

'ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి'

నెల్లికుదురు: జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డికి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఇవ్వాలని తెలంగాణ ప్రదేశ్ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ పెరుమాండ్ల గుట్టయ్య గౌడ్ ఏఐసీసీ, రాష్ట్ర పీసీసీ అధ్యక్షులను కోరారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో దశాబ్దాల కాలంగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న కుటుంబం మాజీ ఎమ్మెల్యే జెన్నారెడ్డి జనార్ధన్‌రెడ్డిది అని తెలిపారు. పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ జిల్లా పరిధిలో ఐదుగురు ఎమ్మెల్యేలను గెలిపించడమే కాకుండా అత్యధిక మెజార్టీ అందించిన భరత్‌చెందర్ రెడ్డికి ఎమ్మెల్సీ ఇవ్వాల్సిందేనని అన్నారు.

బియ్యాల జనార్ధన్‌కు నివాళి



కొత్తగూడ: తెలంగాణ సిద్ధాంతకర్త బియ్యాల జనార్ధన్‌రావు వర్ధంతిని సంర్భంగా కాంగ్రెస్ నాయకులు గురువారం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆపార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య మాట్లాడుతూ జనార్ధన్‌రావు లాంటి మేధావులు వల్లే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన టెండర్లు పిలవాలి

గూడూరు: తునికాకు సేకరణకు యుద్ధప్రాతిపదికన టెంటర్లను పిలువాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఆరెల్లి కృష్ణ, ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బొక్కల భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు గురువారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఫిబ్రవరికి ముందే టెండర్లు పిలిచి మెండెం కొట్టించే పనులు చేపట్టేవారన్నారు. ప్రభుత్వాలు వాటిని విస్మరించి ఇప్పటి వరకు టెండర్లు పిలువకపోవడం శోచనీయమన్నారు. నాయకులు ప్రతాప్ రెడ్డి, సోమయ్య, మదార్, జీవన్, భాస్కర్‌రెడ్డి, ఊక్లా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.